క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లు నిలిపివేత

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డు పరిధిలోని బోథ్, సొనాల, నేరడిగొండ, పొచ్చెర సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి నిల్వలు పేరుకుపోయినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

కైలాస్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు కార్మిక సంఘాల నాయకులు విలాస్, కుంటాల రాములు తెలిపారు. మంగళవారం మున్సిపల్ అధికారులను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. సమ్మెలో మున్సిపల్ కార్మికులంతా పాల్గొంటారని అందుకు అనుమతించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కేంద్రం కార్మికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

సీఎం వైఖరి స్పష్టం చేయాలి

బోథ్: సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి వస్తున్న సందర్భంగా చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే అంశంపై తన వైఖరిని స్పష్టం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు గొడం గణేష్ అన్నారు. మంగళవారం బోథ్ నియోజకవర్గ కేంద్రంలో మాట్లాడారు. గత ప్రభుత్వం ఎస్టీ జాబితాలో 11 కులాలను చేరుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న, పంద్రం శంకర్, దుర్వ విశ్వేశ్వర్, మెస్రం భుమన్న, కుడాల స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇంద్రవెల్లి: ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ శోభాబాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమశాఖల వారిగా నివేదిక చదివి వినిపించారు. ఎంపీపీ పోటే శోభాబాయి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల నుంచి అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం మండల సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఎంపీవో సంతోష్, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజలకు అందుబాటులో ఉంటా'

నేరడిగొండ: నియోజకవర్గంలోని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ముగ్గురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం చించోలి గ్రామానికి చెందిన కుద్మేత జంగుబాయి కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం చెక్కు అందజేశారు. ఇందులో రూ.3 లక్షలు జంగుబాయి కుమారుడి పేరుపై ఫిక్స్ డిపాజిట్ చేయడంతో పాటు రూ.1 లక్ష వ్యక్తిగత అవసరాల కోసం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ నాగోరావ్, సర్పంచులు పెంట వెంకటరమణ, రమేశ్, జంగు, సద్దాం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండల కేంద్రానికి చెందిన గొల్ల పవన్ అనే యువకుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మంగళవారం పవన్ నివాసానికి చేరుకొని పరామర్శించారు. రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఆదిలాబాద్: ఆర్టీసీ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీసీ డిస్పెన్సరీలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యోగేశ్వర్ ఆరోగ్యం పరిరక్షణ విధానాలను ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంఎఫ్ శ్రీకర్, ట్రాఫిక్ ఇన్‌చార్జి శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్ అన్నారు. మావల మండలంలోని వాఘాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పి ఇంత వరకు హామీలు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో నాయకులు ఎవన్, రాజన్న, సుధీర్, గోవర్ధన్ రెడ్డి, విలాస్ రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం..

- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి
- పట్టు సాధించేలా వారానికోసారి పరీక్షలు



నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

నేరడిగొండ: ఇంటర్మీడియేట్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి నిర్వహించాలని బోర్డు అధికారులు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపు కోసం జిల్లా విద్యాధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. గతేడాది కంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించేందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు కృషి చేస్తున్నారు. డిసెంబర్ చివరి నాటికి అన్నిప్రభుత్వ కళాశాలల్లో పాఠ్యాంశాల బోధన పూర్తి చేసిన లెక్చరర్లు విద్యార్థులు రివిజన్ చేసేలా ప్రణాళికలతో ముందుకు సాగారు. సాయంత్రం 4 గంటలకు కళాశాల సమయం పూర్తయిన తర్వాత గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారానికి ఒకసారి ఆయా సబ్జెక్టుల వారీగా పరీక్షలు పెట్టి పట్టు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇంటర్మీడియేట్ తర్వాత ఎంసెట్, నీట్ పరీక్షలు రాసేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

సబ్జెక్టుల వారీగా..

జిల్లాలోని ఆయా కళాశాలల్లో 9,560 మంది ప్రథమ, 9,994 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రత్యేక తరగతుల ద్వారా బోధన సాగుతోంది. పాఠ్యాంశాల వారీగా అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఎక్కువ సమయం లేదు. దీంతో ఉన్న సమయాన్ని అన్ని సబ్జెక్టులకు సద్వినియోగం చేసేలా కళాశాల యాజమాన్యాలు చర్యలు చేపట్టారు. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన ప్రయోగాల సాధన చేయించారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



ఇంటర్మీడియేట్‌లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. డిసెంబర్ మాసంలోనే సబ్జెక్టుల బోధన పూర్తి చేయడం జరిగింది. మొదటి వారం నుంచి ప్రత్యేక తరగతులు చేపడుతాం. దీంతోపాటు సబ్జెక్టులను రివిజన్ చేయించడం జరిగింది. ఎప్పటికప్పుడు లెక్చరర్లు విద్యార్థులను పర్యవేక్షిస్తున్నారు.

రవీందర్, డీఐఈవో, ఆదిలాబాద్

అర్హులకు న్యాయం చేస్తాం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: డబుల్ బెడ్ రూం అర్హులకు న్యాయం చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీ సమీపంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల మనోభావాలతో ఆడుకుందన్నారు. ఎన్నికల సమయాల్లో మాత్రమే డబుల్ బెడ్ రూం పథకాన్ని ప్రకటించిందని మండిపడ్డారు. ప్రజలను మోసం చేయడమే కాకుండా, కమీషన్ల కోసం నాణ్యత లేని ఇళ్లను నిర్మించిందని ఆరోపించారు. తలుపులు, కిటికీలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నాసిరకం సరుకులు సరఫరా చేస్తే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్లు నాసిరకం సరుకులు పంపిణీ చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కేఆర్‌కేలో గల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చిన్నారులు, అంగన్‌వాడీ కేంద్రం హాజరు పట్టికలను పరిశీలించారు. సరుకులు సక్రమంగా వస్తున్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిదారులకు పోషకాహారం అందిస్తున్నారా? లేదా? అనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేసే పౌష్టికాహారంలో నాణ్యత లేదన్నారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు జోగు రవి, వేదవ్యాస్, రాజేష్, ముకుంద్, గంగుబాయి, స్వప్న, రాము, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎమ్మెల్యేను కలిసిన బీజేపీ నాయకులు

సిరికొండ: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బోయార్ తుకారం, సూర్యవంశీ, శివప్రసాద్, బాలాజీ, రామ్ పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

కైలాస్‌నగర్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల సేవలు చిరస్మరణీయమని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో త్యాగధనుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు రెండు నిమిషాల మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, డీఎస్‌వో కిరణ్ కుమార్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, ఈడీఎం రవి కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు రాంరెడ్డి, నలంద ప్రియా పాల్గొన్నారు.

ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో మంగళవారం గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, శాంతి విధానాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్యాణి, పాఠశాల హెచ్ఎంలు జ్యోతి, శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు శంకర్, వికేష్, అంగన్‌వాడీ టీచర్ వెంకటమ్మ, ఉపాధ్యాయులు నగేశ్, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మౌనం పాటిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవీ

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

తలమడుగు: సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని టీఎస్ క్యాబ్ ఏజీఎం సురేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి రుణాలు, ఎరువులు అందించడం జరుగుతుందన్నారు. తలమడుగు సంఘం ద్వారా సుంకిడిలో ఏర్పాటు చేసిన ఫార్మా అగ్రిమార్ట్ లాభాల బాటలో నడుస్తుందన్నారు. సహకార సంఘం చైర్మన్ దామోదర్ రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ రవి యాదవ్, ఫిరోజ్, రాఘవేంద్రరావు, సాగర్ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. మంగళవారం మండలంలోని తాంసి, పొన్నారి, బండల్‌నాగాపూర్ పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల హక్కులు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి సౌజన్య, హెచ్ఎం సంజీవ్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

ఎదులాపురం: రెండో విడత గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న జేడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గొల్ల కుర్మలు డీడీలు కట్టినప్పటికీ ఇప్పటివరకు గొర్రెల పంపిణీ చేపట్టలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు. యాదవులు అధిక సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘువీర్‌యాదవ్, హన్మండ్లు యాదవ్, నారాయణ యాదవ్, మల్లయ్య యాదవ్, వేణుయాదవ్ పాల్గొన్నారు.

పశు పోషణపై దృష్టి సారించాలి

తలమడుగు: రైతుల ఆర్థిక అభివృద్ధి చెందేందుకు వ్యవసాయంతో పాటు పశువు పోషణపై దృష్టి సారించాలని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. మంగళవారం మండలంలోని లచ్చింపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జంతు సంరక్షణ చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి దుద్‌రామ్ రాథోడ్, శివ, చరణ్, సిబ్బంది స్వామి, సౌమ్య, జంగు, ఆశన్న, గంగన్న పాల్గొన్నారు.

సమాచారం

మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా మనోహర్

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శిగా మనోహర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

బోథ్ వాసులకు అబ్దుల్ కలాం అవార్డు

బోథ్: బోథ్ పట్టణానికి చెందిన కొటిక శ్రీనివాస్‌కు, సామాజిక సేవకుడు అనిల్ మానంలకు మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అబ్దుల్ కలాం అవార్డుకి ఎంపికైయ్యారు. లోకేశ్వరంలోని శ్రీవేంకటేశ్వర గార్డెన్‌లో ఫౌండేషన్ చైర్మన్ ఆంజనేయులు అవార్డులు అందజేశారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన నరేందర్ దంపతులు బైక్‌పై నుంచి పడి గాయపడ్డారు. కాగా నిర్మల్ జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. వీరిని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలి

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా అవకాశం కల్పించాలని ఏఐసీసీ సభ్యులు నరేశ్ జాదవ్ కోరారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు.

సన్మానం


బోథ్: సొనాల గ్రామ పంచాయతీ పాలకవర్గానికి, సిబ్బందికి, కోఆప్షన్ సభ్యులను విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య సత్కరించారు. పాలకవర్గ కాలం ముగుస్తున్నందున పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. సర్పంచి సదానందం, గంగామణి, సెక్రటరీ స్వామి పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన దాసండ్ల ప్రభాకర్‌ను మండలంలోని దంతన్‌పల్లి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మోతిలాల సులేమాన్, కొమటిరెడ్డి మల్లారెడ్డి, సూరం లచ్చన్న, సందీప్, యేసు, శ్రీనివాస్, వహీద్, లక్ష్మారెడ్డి, అరవింద్, రజాక్ పాల్గొన్నారు.

తాంసి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహేందర్ రెడ్డి జిల్లా ఉత్తమ ఉద్యోగిగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్నాడు. కాగా మంగళవారం జిల్లా ఆయనను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. హెచ్ఎం శ్రీకాంత్, సర్పంచ్ కృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, అమరేందర్, సంతోష్ పాల్గొన్నారు.

పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలి

ఉట్నూర్‌రూరల్: వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పాలకులు చిత్తశుద్ధితో పని చేయాలని ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఉట్నూర్ డివిజన్ కేంద్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఉట్నూర్ కేంద్రంగా రైల్వేలైన్, అగ్రికల్చర్, డెంటల్, వెటర్నరీ యూనివర్సిటీలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ మండల కన్వీనర్ భరత్ చౌహాన్, బానోత్ రామారావు, గోపాల్‌రావు, కట్ట లక్ష్మణాచారి, నారాయణ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతు కుటుంబాలను ఆదుకోవాలి

నేరడిగొండ: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆత్మహత్యల నివారణ కమిటీ, రైతుస్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండలంలోని బొందిడి గ్రామానికి చెందిన జాదవ్ లక్ష్మణ్ అనే రైతు ఇటీవల పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. అప్పులు, పంట దిగుబడి, తదితర విషయాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రైతు భీమాతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో నం.194 ప్రకారం రూ.6 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. కుటుంబ యజమానురాలికి నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే చిరుధాన్యాలను పండించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట రైతులు సురేందర్, నరేందర్, రాము, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న బొర్రన్న

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

తాంసి: సర్పంచులతో పాటు అధికారుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమవుతుందని భీంపూర్ ఎంపీపీ కుద్మేత రత్నప్రభ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. మొదటగా ఏవో రవీందర్ వ్యవసాయశాఖ నివేదికను చదివి వినిపించారు. నీటి సరఫరాపై ఏఈ చంద్రశేఖర్ మాట్లాడుతుండగా.. సభ్యులు ప్రశ్నించారు. పంచాయతీరాజ్ ఏఈ మజర్ అలీ మాట్లాడేటప్పుడు చేసిన పనులకు త్వరగా బిల్లులు చెల్లించాలని పిప్పల్‌కోటి సర్పంచ్ కల్యాణి కోరారు. గృహ జ్యోతి పథకం కింద రెండువందల యూనిట్లలోపు మండల వ్యాప్తంగా 4773 కనెక్షన్‌లు గుర్తించినట్లు విద్యుత్‌శాఖపై ఏఈ శ్రావణ్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లస్మన్న, తహసీల్దార్ హరిదాస్, లింబాజీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రత్నప్రభ

భావోద్వేగానికి గురైన సర్పంచ్‌లు

అనేక సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి గ్రామాలను అభివృద్ధి చేశామని పలు గ్రామాల సర్పంచ్‌లు మంగళవారం భావోద్వేగానికి గురయ్యారు. తము చేసిన అభివృద్ధి తెలిజేసి, వారి అనుభవాలను పంచుకున్నారు.

ముక్తా సాల్వే ఆశయాలు కొనసాగిద్దాం

నార్నూర్: మాతంగ్ సమాజంలోని మొదటి విద్యార్థిని ముక్తా సాల్వే ఆశయాలు కొనసాగిద్దామని అన్నభావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, దళితరత్న నర్సింగ్ మోరే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముక్తా సాల్వే 183వ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంగ్లేయుల పాలనలో దళిత, బలహీనవర్గాల విద్య హక్కులపై బ్రిటిష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సురేశ్ అడే, డైరెక్టర్ కాంతారావ్ దుర్గే, అన్నభావు సాఠే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ కాంబ్లే, కోర్రల మహేందర్, మహేందర్ దుర్గే, రాణా ప్రతాప్, రాథోడ్ భిక్షపతి, రాజు బర్కుంబే, రాము జివాలే పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

కుష్ఠు నివారణకు కృషి చేయాలి

నార్నూర్: కుష్ఠు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్ అన్నారు. మంగళవారం గుంజాల గ్రామంలో కుష్ఠు నివారణపై అవగాహన కల్పించారు. ఈనెల 31 నుంచి వచ్చే నెల 13 వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరం నిర్వహించి పరీక్షలు చేశారు.

బోథ్: కుష్ఠును నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బోథ్ సర్పంచ్ సురేందర్ అన్నారు. మంగళవారం నక్కలవాడ గ్రామ పంచాయతీలో కుష్ఠు నివారణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీవో జీవన్ రెడ్డి, వార్డు సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ: కుష్ఠుపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. మంగళవారం పీహెచ్‌సీతో పాటు వడూర్, తేజాపూర్, తర్నం, కుమారి, వాంకిడి, కొర్టికల్, గుత్పాల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల ఆరోగ్య పర్యవేక్షకులు హరికుమార్ గౌడ్, రాం నరేశ్, వైద్య సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

ఆదివాసీ గ్రామాల్లో మద్యం విక్రయించొద్దు

నార్నూర్: ఆదివాసీ గ్రామాల్లో మద్యం విక్రయించొద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు పూసం ఈశ్రు అన్నారు. మంగళవారం నాగలకొండ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో కల్తీసారా, మద్యం అమ్ముతూ గిరిజనుల ప్రాణాలతో చెలగాటమడుతున్నారని మండిపడ్డారు. ఈనెల 26న దేవారిగూడకు చెందిన గంగారం మద్యం షాపు వద్దనే అనుమానస్పదంగా మృతి చెందాడని గుర్తు చేశారు. అధికారులు విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పటేళ్లు కోవ మారు, కుమ్రా లక్కేరావు, ఈశ్రు పటేల్, జాలింశావ్ పాల్గొన్నారు.



నాగులకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

రోడ్డు నిబంధనలు పాటించాలి

సిరికొండ: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐ ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణం చేయాలంటే తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. వాహనపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్, ప్రధానోపాధ్యయులు సునీల్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని నేరడిగొండ ఎస్సై సాయన్న అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. బైక్‌పై వెళ్లే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రదీప్ కుమార్